క్లుప్తంగా

స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్



స్పెషల్ చీఫ్ సెక్రటరీతో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ బంగారునాయుడు

విజయనగరం: ఇండస్ట్రీస్, ఐటీ, కామర్స్, ఇన్వెస్ట్మెంట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.యువరాజ్‌ను ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్, విజయనగరం జిల్లాకు చెందిన సంగంరెడ్డి బంగారునాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జిల్లాలో ఫెర్రో ఇండస్ట్రీస్ సమస్యలను వివరించారు. పరిశ్రమల్లో స్థానికులకు కేటాయించవలసిన ఉద్యోగాల భర్తీ పర్సంటేజ్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని విన్నవించారు. కొత్తవలసలో మహిళా పారిశ్రామిక పార్కు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు మండల సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అడ్మినిస్ట్రేట్ అధికారి దాసరి బంగారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



జాతీయ క్రీడాకారిణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ : క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అని పసపాం జెడ్పీ పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పసపాం జెడ్పీ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాతీయ క్రీడాకారిణి పి.వసంతకు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాణించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. లక్ష్యంతో ముందుకు సాగినప్పుడు విజయాలు సొంతమవుతాయని అన్నారు. కార్యక్రమంలో పీఈటీ లీలాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకుడు ఎ.జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక కణపాకలోని ఎస్‌పీఆర్ భవన్‌లో ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం జరిగే ఉద్యమంలో ఆటో డ్రైవర్లంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 5, 6, 7 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలన్నారు. సెప్టెంబరు 16, 17 తేదీల్లో కర్నూల్‌లో రాష్ట్ర వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ రావు, సత్యారావు, శ్రీను, బంగారునాయుడు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ నారాయణునికి అభిషేకాలు



దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేద మంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతభిషేకాలు నిర్వహించారు. ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి పంచామృతభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

మరింత మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక

- కొత్తగా గుర్తించిన అర్హులకు సెప్టెంబర్ 1 నుంచి నగదు పంపిణీ
- నియోజకవర్గంలో కొనసాగుతున్న అర్హుల పరిశీలన
- ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 28,392 మందికి అందుతున్న పెన్షన్ కానుక
- వచ్చే నెల నుంచి మరో 703 మంది పెన్షన్ కానుక పంపిణీకి చర్యలు



వైఎస్సార్ పెన్షన్ కానుక అందుకుంటున్న లబ్ధిదారు(ఫైల్)

విజయనగరం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో నూతన ఒరవడి తీసుకురావటంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించటంలో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ వారికి భరోసా కల్పిస్తోంది. పెన్షన్ కానుక కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన అనంతరం అర్హులను గుర్తించే ప్రక్రియను చేపడుతోంది. రాజకీయాలకు అతీతంగా ఈ ప్రక్రియ గ్రామాల్లో, వార్డుల్లో సాగుతుండగా.. అర్హులైన వారికి సెప్టెంబర్ 1 నుంచి పెన్షన్ కానుక మొత్తాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నారు.

విజయనగరం నియోజకవర్గం పరిధిలో 50 డివిజన్లుగా విస్తరించి ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2019 మార్చి నెల వరకు 18,899 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా వారికి రూ.4.04 కోట్లు మొత్తాన్ని నెలవారీగా అందజేసేవారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2023 ఆగస్టు నెల నాటికి లబ్ధిదారుల సంఖ్య 22,557 మందికి చేరగా... వారికి రూ.6.32 కోట్లు పెన్షన్ కానుకగా అందజేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించగా.. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 1338 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వారి అర్హత పరిశీలన ప్రక్రియ సాగుతుండగా.. ఇప్పటి వరకు 590 మంది అర్హులున్నట్లు గుర్తించారు. విజయనగరం మండల పరిధిలో 2023 ఆగస్టు నెలలో 5835 మంది ప్రభుత్వం పెన్షన్ కానుక అందజేస్తుండగా... తాజాగా మరో 113 దరఖాస్తులు రాగా వారి అర్హతలను అధికారులను పరిశీలిస్తున్నారు.

1వ తేదీనే పింఛన్ కానుక

టీడీపీ పాలనలో పెన్షన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. డబ్బులు బటావాడా చేసే సిబ్బంది ఎప్పుడు వస్తారు... ఎక్కడ ఇస్తారో తెలియక కాళ్లరిగేలా తిరిగేవారు. కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. జన్మభూమి కమిటీలు చుట్టూ ప్రదక్షిణలు చేసి వారికి తాయిలాలు ముట్టచెప్పాల్సి వచ్చేది. అటువంటి పరిస్థితులకు తావు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయటంతో పాటు నెలలో 1, 2 తేదీల్లో ఇంటింటికి వెళ్లి తలుపుతట్టి మరీ పింఛన్ అందించే ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరి పెన్షన్ లబ్ధిదారులు 1వ తేదీన తమకు రావాల్సిన మొత్తం అందటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న అర్హుల పరిశీలన

వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకున్న వారి అర్హత పరిశీలన ప్రక్రియ సాగుతోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత నెల ఆగస్టు వరకు 22,557 మంది పెన్షన్ కానుక అందేది. ప్రభుత్వం నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించగా... 1338 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఇప్పటి వరకు 590 మందిని అర్హులుగా గుర్తించాం. మిగిలిన వారి దరఖాస్తులు పరిశీలిస్తున్నాం. అర్హులైన వారందరికీ సెప్టెంబర్ 1నుంచి పెన్షన్ కానుక అందజేస్తాం.

– సింహాచలం, టీపీఆర్వో, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

గొడిపాలెంలో డయేరియా

- వైద్య శిబిరం ఏర్పాటు



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

డెంకాడ: మండలంలోని వెదుళ్లవలస పంచాయతీలోని గొడిపాలెం గ్రామంలో డయేరియా ప్రబలడంతో పలువురు వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే పది మంది వరకూ డయేరియాతో బాధపడుతున్నారు. డెంకాడ, మోపాడ పీహెచ్‌సీలలో కొందరు, మరికొందరికి గ్రామంలోనే వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఇంకొందరు ప్రైవేటు ఆస్పత్రిలో కూడా చికిత్స పొందినట్టు స్థానికులు చెబుతున్నారు. వ్యాధి విస్తరిస్తుండటంతో మోపాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య అధికారులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ రాజ్‌కుమార్ తదితరులు గ్రామంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కాలువల్లో పూడికతీతతో పాటు వీధుల్లో బ్లీచింగ్ చల్లించామని తెలిపారు. వాటర్ ట్యాంకు క్లోరినైజేషన్ కూడా చేయించామని వివరించారు. వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా గ్రామంలో ఎవరూ మాంసం, చేపలు విక్రయాలు చేయరాదని ఆదేశించామని అధికారులు వివరించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్ నాయుడుకు ఘన సత్కారం



సత్కారం పొందుతున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోల్ వాల్ట్ ఏఆర్ కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసినాయుడు

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్ వాల్ట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసినాయుడుకు స్థానిక దండుమారమ్మ కాలనీ వాసులు మంగళవారం ఘనంగా సత్కరించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీలంకలోని రాజపక్షే స్టేడియంలో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో ఆయన ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 42వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లక్ష్యం పెట్టుకొని ముందుకెళ్లినపుడే విజయాలను సాధించగలరని అన్నారు. చిన్ననాటి నుంచి పట్టుదలతో కష్టపడి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నాయుడు పలువురికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పేద కుటుంబం నుంచి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. పోల్ వాల్ట్ విభాగంలో తాను 15 ఏళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి స్థాయి పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్‌గా గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కార్పొరేటర్ కళావతి దంపతులు, కాలనీవాసుల చేతుల మీదుగా శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు బి.రామకృష్ణ, గాంధీ, ఉపాధ్యాయులు అవతారం, వెంకునాయుడు, శశిభూషణరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు గణేష్, రాము, మెహరాజ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మేలు జాతి లేగ దూడల కోసం ప్రత్యేక ఇంజక్షన్లు



సతివాడలో పాడి రైతులకు స్టీల్ క్యాన్‌లు అందజేస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: మేలు జాతి ఆడదూడలు పుట్టేందుకు లింగ నిర్ధారిత వీర్యాన్ని రైతులకు అందుబాటులో ఉంచామని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎస్.దామోదరరావు తెలిపారు. మండలంలోని సతివాడ గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ పశు సంరక్షణపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. మేలైన ఆడదూడలు పుట్టేందుకు ప్రత్యేక ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఎదకు వచ్చిన పశువులకు ఈ ఇంజక్షన్లు వేయిస్తే 90 శాతం పైబడి ఆడదూడలు పుడతాయన్నారు. అనంతరం వయసుల వారీగా ఆరోగ్యకరమైన లేగ దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యన్నారాయణ, వైద్యాధికారిణి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలి



ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

నెల్లిమర్ల రూరల్: నిర్ణీత వ్యవధిలోగా ఓటర్ల జాబితా ప్రక్రియను పూర్తి చేయాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఓటర్ల జాబితా ఇంటింటా సర్వేలో మంగళవారం పాల్గొని పరిశీలించారు. బీఎల్‌ఓలతో మాట్లాడి ఓటర్ల జాబితా తయారీ, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. తప్పులు లేకుండా సక్రమంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి పరిశీలన



డీసీహెచ్ఎస్ గౌరీశంకర్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యులు, సిబ్బంది

సాలూరు: పట్టణంలో ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ గౌరీశంకర్ మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సౌకర్యాలు, సదుపాయాలపై ఆరా తీశారు. రోగులు తాకిడి అధికంగా ఉండడాన్ని గుర్తించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతున్న క్రమంలో అది త్వరగా అందుబాటులోకి రానుందని వైద్యులు తెలిపారు.


రోగులకు సకాలంలో వైద్య సేవలు



ఫీమేల్ సర్జికల్ వార్డులో వైద్య సేవలపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలోని పలు వార్డులను, ఓపీ విభాగాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఏమ్మా.. ఏ సమస్యతో ఆస్పత్రికి వచ్చావు, వైద్యులు బాగా చూస్తున్నారా, బెడ్ షీట్స్ ప్రతి రోజు మారుస్తున్నారా, మందులు అన్ని ఇస్తున్నారా.. అని రోగులను అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అవసరమైన రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేయాలన్నారు. విధుల పట్ల వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు. అలసత్వం వహించరాదన్నారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రామతీర్థంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిపించారు. శ్రీరాముడి ఎదురుగా కొలువై ఉన్న ఆంజనేయ స్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణాలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, పవన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



క్షేత్ర స్థాయిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో రైతులకు పంటల యాజమాన్యంపై ఏఓ పూర్ణిమ మంగళవారం అవగాహన కల్పించారు. విత్తనం నుంచి విక్రయం వరకు ఎటువంటి పద్ధతులు పాటించాలనే అంశంపై రైతులకు వివరించారు. విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగుల మందు ఉపయోగించొద్దన్నారు. వచ్చే నెల 15లోపు ఈ – పంటలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధ వ్యాధి నిర్మూలనకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: బోధ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. సంతపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోధ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించిన సామగ్రిని మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధ వ్యాధి ఉన్న వారు చికిత్స తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. వైద్యుని సలహా మేరకు మందులు వాడాలన్నారు. రెండు కాళ్లకు బోధ ఉన్న వారికి ప్రభుత్వం పింఛన్ అందిస్తుందన్నారు. దోమలు కుట్టకుండా చూసుకోవడం ద్వారా బోధ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి మణి, ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనం, క్రీడల ఆవశ్యకతను వివరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



డెంకాడ: గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి పంతుల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు



విజయనగరం టౌన్: వన్‌టౌన్ స్టేషన్ ఆవరణలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తదితరులు



గురజాడ గ్రంథాలయంలో మహా ద్విశతావధాని మరడాన శ్రీనివాసరావును సత్కరిస్తున్న వాగ్దేవీ సమారాధనమ్ జైపైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం ప్రతినిధులు



విజయనగరం రూరల్: వేషధారణలో విద్యార్థులు



నెల్లిమర్ల రూరల్: బొప్పడాం ఉన్నత పాఠశాలలో వివిధ వేషధారణాల్లో విద్యార్థులు

అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు



అక్కినేని నాగార్జున ఫ్లెక్సీ వద్ద సంబరాలు చేస్తున్న అక్కినేని అభిమానులు

విజయనగరం టౌన్: అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను అక్కినేని అభిమానులు ఎన్‌సీఎస్ థియేటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి, థియేటర్ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని ఫ్యాన్స్ ప్రతినిధి కంటుభుక్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 21 ఏళ్ల తర్వాత వచ్చిన మన్మథుడు సినిమాకి నేటికీ ఆదరణ తగ్గలేదన్నారు. అభిమానులందరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మన్మథుడు చిత్రాన్ని రీ రిలీజ్ చేశారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు కట్టమూరి సుబ్రహ్మణ్యం, ధారా వెంకట్, నాగేష్, కృష్ణ, వివేక్, కిరణ్, శ్రీనివాస్, జగదీశ్ పాల్గొన్నారు.